ఓం శ్రీ సాయిరాం

# సాయి సంక్రాంతి

(సంగీత నృత్య రూపకం)

ప్రార్థన నృత్యం

శ్లో : శ్రీ సాయి చరణం జగదేకశరణం
సత్యసాయి చరణం భవతాపహరణం
సత్యసాయి చరణం సకలార్తి హరణం
సత్యసాయి చరణం శరణం ప్రపద్యే

కీర్తన: పర్తిగణేశం ప్రణమామ్యహమ్
వరదాభయదం వాంఛిత ఫలదం ॥పర్తి॥

1. సింధురవదనం ఆనందసదనం
మోహవినాశకం ప్రణమామ్యహమ్
గౌరీతనయం నవనీతహృదయం
సాయిగణేశం ప్రణమామ్యహమ్ ॥పర్తి॥

2. సృష్టిస్థితిలయ కారణం దేవం
మోక్షదాయకం ప్రణమామ్యహమ్
ప్రేమావతారం జగదేకవీరం
వీరగణేశం ప్రణమామ్యహమ్ ॥పర్తి॥

సూత్రధారుడు:

ఓం శ్రీ సాయిరాం. నేడు సంక్రాంతి. విఘ్ననాయకుడైన వినాయక వందనంతో మన సంక్రాంతి సంబరం ప్రారంభమవుతుంది. ఈశ్వరత్వానికి సంకేతం వెలుగు. వెలుగు వెల్లువల్ని మనపై ప్రసరించిరన అజ్ఞాన అంధకారాలను తొలగించి, జ్ఞానజ్యోతిని వెలిగించేవాడు ప్రత్యక్షదైవమైన సూర్య భగవానుడు. ఆయన లేనిదే మన జీవితంలో వెలుగు లేదు. వేడిమి లేదు. పైరు లేదు. పంటలేదు. అజ్ఞాన హరణంతో మనలో సేవాతత్పరత, ప్రేమతత్వం, త్యాగనిరతీ వికసిస్తాయి. ఈ శుభోదయమే సంక్రాంతి.

శ్లో: సప్తాశ్వరథ మారూఢం ప్రచండం కశ్యపాత్మజం
శ్వేత పద్మ ధరం దేవంతం సూర్యం ప్రణమామ్యహమ్

విరిసిన ముద్దబంతిలా ముత్యాల హారాలతో, ఘల్లుఘల్లున మ్రోగే చిరుగజ్జెల సవ్వడితో సంక్రాంతి లక్ష్మి మన ఇంట కాలు పెడుతుంది.

పాట : సంక్రాంతి ఈవేళ మకర సంక్రాంతి
నవక్రాంతి ఈ రోజు నవ్యతకు నాంది ॥సంక్రాంతి॥

1. మిన్నేటి పన్నీరు భువికి ఒలికినవేళ
కేదారములు నింగిపొంగి పొరలినవేళ
సౌభాగ్యలక్ష్మి మన ఇంట నడచినవేళ
మానవాళికి నేడు చైతన్యహేల ॥సంక్రాంతి॥

2. ఘల్లుఘల్లున పాద మంజీరములు మ్రోయ
ముత్యాల హారతులు మిలా మిలా మెరయ
విరగ పండిన పంట వయ్యారి నడకతో
మన యింట నడయాడు సంక్రాంతి లక్ష్మి ॥సంక్రాంతి॥

సూత్రధారుడు:

సంక్రాంతి లక్ష్మిని సాదరంగా ఆహ్వానించడానికి ధనుర్మాసంలో మేలుకొలుపులు పాడుతారు. దీని అర్థం పరమార్థం దైవాన్ని మేల్కొలపాలని కాదు. మనలో దైవభావనలు మేల్కొనాలనీ, ఆసురీభావనలు అంతరించాలని, జగత్కర్త, భర్త అయిన శ్రీ సత్యసాయి భగవానునికి మేలు కొలుపులు పాడుదాం

కలువరేకుల కనులు తెరువవా మా స్వామి
నిలువెల్ల కన్నులై నిలచినది ఈ భూమి
భువనమంతా నిలచి భూపాలరాగమై
మేల్కొల్ప వేచినది మేలుకో మా సాయి
మేలుకో మా సాయి – మమ్మేలుకో మా సాయి ॥కలువ॥

1. వేచి యున్నది స్వామి వేగుచుక్క నింగి
తొలి దర్శనము చేసి మరలిపోదామని
వేచి యున్నాడదుగో కడలిలో భానుడు
తొలి చూపుతో నీవు అనుమతిస్తావని
మేలుకో మా సాయి మమ్మేలుకో మా సాయి ॥కలువ॥

2. యుగధర్మ పాలనకు భువినవతరించిన
సర్వమతములకే సారథై నిలచిన
సత్యసాయీ నీ సందర్శనానికై
అల్లదిగో దేవతలు నిలిచిన నింగిన
మేలుకో మా సాయి, మమ్మేలుకో మా సాయి. ॥కలువ॥

సూత్రధారుడు:

మూడు రోజుల సంక్రాంతి సంబరాలు భోగితో ప్రారంభమవుతాయి. చిరు చలిలో భోగిమంటలు వేసుకొని, మనలోని దుర్గుణాన్నీ, దుర్భావాల్నీ భస్మం చేసి, పేదా, గొప్పా అనే భేదాన్ని మరచి, ఆంతర్యంలో స్నేహాన్ని నింపుకొని ఆనందంగా అందరం ఏకం కావటమే దీని ముఖ్యోద్దేశం. సంక్రాంతి అంటే ముద్దబంతి పువ్వులాంటి  ఆడపిల్లల ఆనందం అంబరాన్నంటుకు:టుంది. ధనధాన్యాలతో, సంస్కృతీ సంప్రదాయాలతో, తెలుగు లోగిళ్ళ అందాన్ని ఇనుమడింపచేస్తూ గొబ్బెమ్మలను అలంకరిస్తారు. గోమయంతో అలికి, రంగురంగుల రంగవల్లులు తీర్చి గొబ్బెమ్మలు పెట్టి గుమ్మడి పూలతో, బంతి చామంతి పూలతో అలంకరిస్తారు.

గొబ్బియ్యల్లో గొబ్బియ్యల్లో
పర్తిసాయి ముంగిట వేసిన గొబ్బియ్యల్లో
సత్యసాయి సన్నిధి వేసిన గొబ్బియ్యల్లో

1. ముత్యాల ముగ్గులు వేసి గొబ్బియ్యల్లో
మాణిక్యాల ముగ్గులు వేసి గొబ్బియ్యల్లో
ఆ ముగ్గుల మీద మొగిలిపూలు గొబ్బియ్యల్లో
పర్తిసాయికి మల్లెపూలు గొబ్బియ్యల్లో ॥గొబ్బియ్యల్లో ॥

2. భూ దేవంత ముగ్గులు వేసి గొబ్బియ్యల్లో
లక్ష్మీరథము ముగ్గులు వేసి గొబ్బియ్యల్లో
ముగ్గుల మీద నక్షత్రాలు గొబ్బియ్యల్లో
సత్యసాయికి తులసీదళములు గొబ్బియ్యల్లో

3. దీనుల పాలిట దేవదేవునికి గొబ్బియ్యల్లో
ప్రేమను పంచే పురుషోత్తమునికి గొబ్బియ్యల్లో
సాయిగంగను ఇచ్చిన స్వామికి గొబ్బియ్యల్లో
చల్లని తండ్రికి సత్యసాయికి గొబ్బియ్యల్లో ॥గొబ్బియ్యల్లో॥

సూత్రధారుడు :

సంక్రాంతి శుభదినాన హరినామస్మరణాన్ని అందరికీ సుమధురంగా వినిపిస్తూ, వారిలో భక్తి భావాలను జాగృతం చేస్తూ, సంక్రాంతిని శుభక్రాంతిగా మారుస్తారు హరిదాసులు. అరుగో హరిదాసులు వస్తున్నారు.

హరిలో రంగ హరీ! హరిలో రంగ హరీ
హరి నారాయణ! ఆదినారాయణ ॥హరిలో॥

1. కమలనాభ హరి కరివరదా హరి
కమల నయన హరి శేషశయన హరి ॥హరిలో॥

2. గరుడ గమన హరి గానలోల హరి
నారాయణ హరి నరసింహా హరి ॥హరిలో॥

సూత్రధారుడు

పసిపాపలను సకల దేవతలు ఆశీర్వదించాలని తల్లులందరూ పుణ్యస్త్రీలందరిచేతా భోగిపళ్ళు పోయించి ఆశీస్సులందుకుంటారు. మా బాబా మనసు వెన్న మనసు. మా బాబా చూసు వెన్నెల చూపు. మా సాయి మాట తేనె ఊట. అందుకే మా సత్యసాయికి భక్తులందరూ భోగిపళ్ళు పోస్తారు.

పాట : భోగిపండ్లు పోయరే సత్యసాయికి
భాగ్యమిచ్చుస్వామికి పర్తిసాయికి

1. విఘ్నేశ్వరుడేఊ వచ్చి ఇఘ్నాలు తొలగింప
షణ్ముఖుడే దిగి వచ్చి శాస్త్రాలు వల్లింప
సప్తఋషులు దయచేసి ప్రేమారలాలింప
భాగ్యమిచ్చుస్వామికి పర్తిసాయికి ॥భోగిపండ్లు॥

2. బ్రహ్మదేవుడే వచ్చి వేదాలు వల్లింప
విష్ణుదేవుడే వచ్చి వీవనలు వీచగా
పరమేశ్వరుడే వచ్చి తాండవమ్ము చేయగా
భాగ్యమిచ్చుస్వామికి పర్తిసాయికి ॥భోగిపండ్లు॥

3. రామచంద్రుడే వచ్చి రక్ష చేయగా
శ్రీకృష్ణుడు అడుగుపెట్టి సిరుల విరులు కురియగా
శ్రీ వెంకటేశ్వరుడు వైభవమ్ము చూడగా
భాగ్యమిచ్చుస్వామికి పర్తిసాయికి ॥భోగిపండ్లు॥

సూత్రధారుడు :

సర్వం శుభంకరులయిన శివ శక్తుల సమన్వయ స్వరూపమే భగవాన్ శ్రీ సత్యసాయిబాబా. ఈ సంక్రాంతి శుభాలను చేకూర్చాలంటే అమృతాభిషేకాలతో శివారాధన చేయడం మన సంప్రదాయం. పరమశివుడు మన వాకిట నిలబడినట్లుగా శంఖనాదం చేసుకుంటూ, శివనామ సంకీర్తనం చేస్తూ, జంగమదేవర ప్రత్యక్షమౌతాడు.

శంభోశంకర సాంబశివా
శివ శివ శంకర సాంబశివా
హర హర శంభో సాంబశివా
శివ శక్తీశ్వర సాంబ శివా

(శివ తాండవం)

పాట : ఓం శ్రీ నమ:శివాయ ఓం నమ:శివాయ
హర హర హర శివ శంకర ఓం నమ:శివాయ
హరి, ఓం, నమ:శివాయ
హర హర, భవహర శంభో ఓం నమ:శివాయ

1. హే మహేశ వ్యోమకేశ ఓం నమ:శివాయ
గంగాధర త్రిపురహరా ఓం నమ:శివాయ
మృత్యుంజయ శత్రుంజయ ఓం నమ:శివాయ
ఫాలనేత్ర భూత మిత్ర ఓం నమ:శివాయ ॥హరహర॥

2. బాల శశి విభూషణా ఓం నమ:శివాయ
వ్యాంఘ్రాంబరధారణా ఓం నమ:శివాయ
ఆశ్రిత జనశరణా ఓం నమ:శివాయ
హరివిరించి నతచరణా ఓం నమ:శివాయ ॥హరహర॥

3. సుందర ప్రశాంతి సదన ఓం నమ:శివాయ
గాన మనోహరవదనా ఓం నమ:శివాయ
పర్తివాస మృదుహాసా ఓం నమ:శివాయ
సకల భువన శాంతిదాత ఓం నమ:శివాయ

సూత్రధారుడు:

సంక్రాంతి సంప్రదాయంలో ముఖ్యమైన అంశం బొమ్మల కొలువు. వివిధ దేవతామూర్తుల అందమైన బొమ్మలను సేకరించి, అందంగా అమర్చి అనేక రూపనామాలతో సర్వేశ్వరుని వైభవాన్ని గానం చేస్తూ, బంధు మిత్రులందరినీ ఆహ్వానించి, ప్రేమబంధాన్ని పెంచుకునే చక్కని సంప్రదాయం ఈ బొమ్మల కొలువు. మనమూ చూద్దాం.

కన్నులార చూడరే బొమ్మలకొలువు
దేవతలే దిగివచ్చిన సాయీశుని కొలువు ॥కన్ను॥

1. చిరునగవుల సీతమ్మతో శ్రీరాముడితడు
శ్రీమాతా, శ్రీవాణీ మూర్తులిరుగో చూడు
వెంకటపతి, వినాయకుడు, పార్వతీవల్లభుడు
సర్వదేవతలునేడు పర్తికి దయచేసినారు ॥కన్ను॥

2. పది అవతారములివిగో, కొండపల్లి బొమ్మలు
లేపాక్షి బసవన్న - మా కనకదుర్గమ్మ
వేణుగోపాలుడు, వీర హనుమంతుడూ
సర్వదేవతాతీతుడు సాయీశ్వరుడితడు ॥కన్ను॥

సూత్రధారుడు :

సంక్రాంతి శుభ సమయంలో పరమశివుని ఢమరుకనాదం శుభాన్నీ, విజయాన్నీ సూచిస్తుంది. ఆ ఢమరుక నాదాన్ని వినిపిస్తూ, మనకి శుభం పలుకుతూ, పేరు పేరునా సకల దేవతల పలుకుగా మన ధర్మాన్నీ, మానవధర్మాన్నీ మనకు గుర్తు చేస్తూ వస్తారు బుడక్కలవారు అరుగో

శుభోజ్జయం! శుభోజ్జయం!
అంబ పలుకు, జగదంబ పలుకు
బెజవాడ కనకదుర్గమ్మ పలుకు,
కంచికామాక్షి పలుకు,
మధుర మీనాక్షి పలుకు,
ఏడుకొండల ఎంకన్న పలుకు,
సింహాద్రి అప్పన్న పలుకు,
శ్రీశైల మల్లన్న పలుకు ॥అంబ పలుకు॥

అమ్మలకు అమ్మ మన భారతాంబ అని పలుకు
పంచ మాతలను ప్రేమించమని పలుకు
స్నేహవిరులే పంటసిరులని పలుకు
త్యాగమే, మన యోగమని పలుకు
సత్యసాయి సన్నిధే మన పెన్నిధియని పలుకు ॥అంబ పలుకు॥

పలుకవే తల్లి పలుకు పలుకు
భారతాంబకు నేడు శుభము పలుకు
దీనజనుల పట్ల ప్రేమ పలుకు
సకల లోకాలకు శాంతి పలుకు
సర్వ జనులకు ఈనాడు శుభము పలుకు ॥అంబ పలుకు॥

సూత్రధారుడు :

సంక్రాంతి సంబరాలలో మూడవ దినము కనుము. పంట సిరులందించే బసవన్నలను, పాలిచ్చి పోషించే గోమాతలను పూలతో, పసుపు కుంకుమలతో అలంకరించి, పూజించి, కృతజ్ఞతలు చెప్పుకుంటారు. అందంగా అలంకరించిన నందులను గందిరెద్దుదాసులు తీసుకొని వచ్చి, చక్కని పాటలతో, నందులచేత నృత్యం చేయిస్తారు.

డూ డూ బసవన్నా! రారా
డూ డూ బసవన్నా!

1. శివుని మూపుపై మోసినవాడవు
పాలమున హలమును లాగినవాడవు
బంగారం పండించేవాడవు
సింగారము ఒలికించినవాడవు
డూ డూ బసవన్నా డూ డూ బసవన్నా ॥డూడూ॥

2. సాయి ప్రభువుకు దణ్ణంపెట్టు
సత్యసాయికి ఆటలు చూపు
పైడి కొమ్ములు, వెండి గిట్టలు
ప్రభువులు, నీకు ఇస్తారంట
బంగారం, సింగారం వద్దు
ఆశీస్సులు పదివేలని చెప్పర
డూ డూ బసవన్నా! డూ డూ బసవన్నా! ॥డూడూ॥

సూత్రధారుడు :

స్వామీ! సత్యము, ధర్మము, జ్ఞానము, నీవనుగ్రహించిన ఐశ్వర్యాలే. ఈ 'సాయి సంక్రాంతి" పర్వదిన సందర్భంగా సేవా తత్పరతా, ప్రేమభావం మాలో వేయి రేకుల పద్మంలా వికసించేలా దీవించండి. ఆ స్ఫూర్తితో మీ సన్నిధే మా పెన్నిధిగా భావిస్తూ, భారతీయ సంస్కృతిని గళమెత్తి చాటుతూ, తల్లితండ్రులను దైవాలుగా సేవిస్తూ, సాయిబాటయే రాచబాటగా పయనిస్తామని దీక్ష పూనుతున్నాం.

పాట – పల్లవి : సత్యసాయి బాలవికాస్ బాలలం – శ్రీ సత్యసాయి బాలవికాస్ బాలలం
ప్రేమామృతమూర్తి సాయి కన్నబిడ్డలం
సత్యసాయి అమృతవాణి మాకు వేదము – సత్యధర్మ శాంతి ప్రేమ మా నినాదము
జై సాయిరాం, జై సాయిరాం, జై సాయిరాం, జైజై సాయిరాం ॥సత్యసాయి॥

చ. 1. యోగభూమి మనది, త్యాగభూమి మనది
వేదభూమి, పుణ్యభూమి, భరతభూమి మనది
మన భారత సంస్కృతిని గళమెత్తి చాటుతాం
సమతా, మమతా పెంచి ఆదర్శం చూపుతాం
జై సాయిరాం, జై సాయిరాం, జై సాయిరాం, జైజై సాయిరాం ॥సత్యసాయి॥

చ. 2. కనిపెంచిన కన్నతల్లి మాకు ప్రాణము
నడకా నడతా నేర్పిన తండ్రి మాకు దైవము
విద్యాబుద్ధులు గరపే గురువులు ఇలవేల్పులు
సాటివారు, తోటివారు మాకు ఆత్మబంధువులు
జై సాయిరాం, జై సాయిరాం, జై సాయిరాం, జైజై సాయిరాం ॥సత్యసాయి॥

చ. 3. బడిని గుడిగ భావించి మా చదువులు సాగిస్తాం – 2
దైవప్రీతి, సంఘనీతి, పాపభీతి పాటిస్తాం – 2
దీనజనులసేవ దివ్య కుసుమంగా అర్పిస్తాం
సాయి మాట బాటగా ప్రతీక్షణమూ జీవిస్తాం
జై సాయిరాం, జై సాయిరాం, జై సాయిరాం, జైజై సాయిరాం ॥సత్యసాయి॥

జై సాయిరాం